క్లుప్తంగా

కొండకరకాంలో క్రికెట్ టోర్నమెంట్



క్రీడాకారులతో వైఎస్సార్‌సీపీ నాయకులు రాంబాబు, తదితరులు

విజయనగరం రూరల్: మండలంలోని కొండకరకాం గ్రామంలో కొండకరకాం ప్రీమియర్ లీగ్ పేరుతో క్రికెట్ టోర్నమెంట్‌ను స్థానిక వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు కిలారి రాంబాబు బుధవారం ప్రారంభించారు. ప్రతి ఏడాదీ సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఐపీఎల్ తరహాలో గ్రామంలోని యువత మధ్య క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంక్రాంతి రోజున ఫైనల్ మ్యాచ్ ఉంటుందని.. విజేతలకు రూ. 20,000, రూ.10,000 నగదు బహుమతులు అందజేస్తామన్నారు.

15లోగా డీలర్ పోస్టుల భర్తీ

విజయనగరం రూరల్: మండలంలోని ఖాళీగా ఉన్న నాలుగు డీలర్ పోస్టుల భర్తీకి ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేశామని, ఈ నెల 15వ తేదీలోగా ఖాళీలను భర్తీ చేస్తామని సీఎస్‌డీటీ రామారావు తెలిపారు. మండల పరిధిలోని జమ్ము, ముడిదాం, కోరుకొండ, నారాయణపురం గ్రామాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేయగా జమ్ము గ్రామానికి సంబంధించి మూడు దరఖాస్తులు రాగా పరీక్ష కూడా నిర్వహించామని తెలిపారు. కోరుకొండ, ముడిదాం గ్రామాలకు సంబంధించి ఎస్సీ మహిళలకు రిజర్వ్ కావడంతో ఒక్క దరఖాస్తు కూడా అందలేదని చెప్పారు. అలాగే నారాయణపురం పోస్టుకు సంబంధించి ప్రస్తుత డీలర్ కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారని తెలిపారు.

మొయిదలో నగర సంకీర్తన..

నెల్లిమర్ల రూరల్: పవిత్ర ధనుర్మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని మొయిద విజయరామపురం గ్రామంలో బుధవారం మేల్కొలుపు (నగర సంకీర్తన) కార్యక్రమాన్ని భక్తులు నిర్వహించారు. ఈ సందర్భంగా వీధుల్లో తిరుగుతూ భక్తి గీతాలు ఆలపించారు. సుమారు 60 సంవత్సరాలుగా మేలుకొలుపు నిర్వహిస్తున్నామి చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ అట్టాడ కృష్ణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నిరసన దీక్ష రేపు

నెల్లిమర్ల: మున్సిపల్ కార్మికుల జీఓల అమలుకు సంబంధించి ఈ నెల 10న నిర్వహించనున్న నిరసన దీక్షను విజయవంతం చేయాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ. జగన్మోహన్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద దీక్షకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు దుర్గారావు, శ్రీను, విక్రమ్, రామునాయుడు, రాము, శేఖర్ పాల్గొన్నారు.

కౌమారదశ కీలకం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీరాం

డెంకాడ: బాల,బాలికలకు 11 నుంచి 18 సంవత్సరాల మధ్య ఉండే కౌమారదశ చాలా కీలకమని ఎంఈఓ వి. శ్రీరాం, ఏసీడీపీఓ ఎం. సత్యవతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కిశోర వికాసం పేరిట అధికారులు, సిబ్బందికి బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కౌమార దశలో సరైన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. బాల్య వివాహాల వల్ల చాలా అనర్థాలు జరుగుతాయని ఎతలిపారు. డ్రాపౌట్స్, బాలికల అక్రమ రవాణాపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎ.సత్యవతి, పి.శైలజారాణి, సెక్రెటరీలు, మహిళా పోలీసులు, వీఆర్‌ఓలు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతం విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాల సివిల్ విద్యార్థులు పట్టణంలోని బహుళ అంతస్తుల భవనాన్ని గురువారం క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ తీరుపై ఇంజినీర్ ఎ. భాస్కర్ వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, అధ్యాపకులు డాక్టర్ జి.రవికిషోర్, అధ్యాపకులు ఎం.భార్గవి, కె.గాయత్రి, బీహెచ్‌ఎస్ ప్రశాంతి, జి.గౌతం, శరత్ పాల్గొన్నారు.

గవర కులస్తులను బీసీ-ఏ లోకి మార్చాలి

విజయనగరం టౌన్: గవర కులస్తులను బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చాలని గౌరీ సేవాసంఘ జిల్లా అధ్యక్షుడు ఎంకేబీ శ్రీను డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక సంతపేట, గవర వీధి వద్ద నున్న జగన్నాథస్వామి ఆలయంలో సంఘం ఆధ్వర్యంలో రూపొందించన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం గవర కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి మళ్ల సురేంద్రను చైర్మన్‌గా 12 మంది డైరెక్టర్లను నియమించడం ఆనందంగా ఉందన్నారు. అయితే తమను బీసీ ఏ లోకి మార్చి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి మొల్లేటి చిన్నారావునాయుడు, కోశాధికారి బొడ్డేటి సంతోష్‌కుమార్, కాండ్రేగుల శేఖర్, ఆడారి నగేష్, కనిశెట్టి సుధాకర్, విశ్వనాథం, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

భవితకు దిక్సూచి

- కాంపిటేటివ్ పుస్తకాలతో కొలువుదీరిన పూసపాటిరేగ శాఖా గ్రంథాలయం
- పెద్ద సంఖ్యలో హాజరవుతున్న నిరుద్యోగులు, విద్యార్థులు
- పాఠకులు కోరిన పుస్తకాలు సమకూరుస్తున్న గ్రంథాలయ అధికారులు



పూసపాటిరేగ శాఖా గ్రంథాలయం

పూసపాటిరేగ: నిరుద్యోగ యువతకు పూసపాటిరేగ శాఖా గ్రంథాలయం దిక్సూచీగా నిలుస్తోంది. ప్రస్తుతం ఉద్యోగం పొందాలంటే తప్పనిసరిగా ఇతరులతో గట్టిగా పోటీ పడాల్సిందే. ఇందుకు ఎంతో ఖరీదైన పుస్తకాలు కొని చదువుకోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితులలో విద్యార్థులు చదువుకోవడానికి వీలుగా స్థానిక శాఖా గ్రంథాలయం అవసరమైన కాంపిటేటివ్ పుస్తకాలను సమకూరుస్తోంది. విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్‌కు గ్రంథాలయ సంస్థ వేలాది రుపాయలు ఖర్చు చేస్తోంది.

ఆరు వేలకు పైగా పుస్తకాలు..

పూసపాటిరేగ రాజావీధి శాఖా గ్రంథాలయంలో సుమారు ఆరు వేల రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. వీటికి తోడు మరో 100 వరకు పుస్తకాలను గ్రంథాలయాధికారి ఎం. నాగేశ్వరరావు సమకూర్చారు. వాటిలో పోటీ పరీక్షలు, బాల సాహిత్యం, పురాణ గ్రంథాలు, గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు, కాంపిటేటివ్ పరీక్షకు సన్నద్ధమయ్యే యువతకు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. త్వరలో మరన్ని పుస్తకాలు వస్తాయని తెలిపారు. గ్రంథాలయాన్ని ఉదయం 8 గంటల నుంచి 11 వరకు.. సాయంత్రం 4 నుంచి ఏడు గంటల వరకు నిర్వహిస్తున్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నవారు గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలని గ్రంథాలయాధికారి నాగేశ్వరరావు కోరుతున్నారు. మహిళలకు ఇంటి వద్ద చదవుకోవడానికి నవలలు, ఇతర పుస్తకాలు కూడా ఇస్తున్నట్లు చెప్పారు.



పుస్తకాల విభాగం

అందుబాటులో దినపత్రికలు.

శాఖా గ్రంథాలయంలో అన్ని రకాల దిన, వార, మాస పత్రికలు అందుబాటులో ఉంటున్నాయి. గ్రంథాలయానికి వచ్చే అన్ని రకాలు పత్రికలు చదువుకోవచ్చు. పిల్లలు, పెద్దలకు ఉపయోగపడే పుస్తకాలు కూడా ఉన్నాయి. గ్రంథాలయాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు పొందుతున్నారు. ఇది మంచి తరుణం.

– జమ్మ శ్రీనివాసరావు, పాఠకుడు, పూసపాటిరేగ

పోటీ పరీక్షల మెటీరియల్ ఉంది..

తోటి మిత్రులతో కలిసి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాం. అందుకు కావాల్సిన మెటీరియల్ గ్రంథాలయంలో లభిస్తోంది. గ్రంథాలయంలో వాతావరణం చాలా బాగుంది. సిబ్బంది సహకరిస్తున్నారు. పోటీపరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు గ్రంథాలయం నిజంగా ఓ వరం.

ఎస్.రామారావు, నిరుద్యోగి, పూసపాటిరేగ

మరిన్ని పుస్తకాలు సమకూర్చుతాం

అవసరాన్ని బట్టి మరిన్ని పుస్తకాలు సమకూర్చుతాం. ఇప్పటికే గ్రంథాలయంలో సుమారు ఆరు వేల వరకు పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు, కాంపిటేటివ్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పుస్తకాలు అందుబాటులో వున్నాయి. కొత్తగా మరిన్ని పుస్తకాలు అందుబాటులోకి వస్తాయి.

నాగేశ్వరరావు, శాఖా గ్రంథాలయ అధికారి, పూసపాటిరేగ.

అంచెలంచెలుగా ఎదుగుతూ.. పలువురికి ఉపాధి కల్పిస్తూ..

- ఉడెన్ ప్యాలెట్స్, ఫర్నీచర్, ప్యాకింగ్ మెటీరియల్స్‌లో డీకేఎస్ ప్రస్థానం

విజయనగరం: తాను ఎదగడంతో పాటు మరో పదిమందికి ఉపాధి కల్పించాలన్న సత్సంకల్పంతో స్థాపించిన డీకేఎస్ ఉడెన్ ప్యాలెట్స్, ఫర్నీచర్, ప్యాకింగ్ మెటీరియల్స్ సంస్థ అంచెలంచెలుగా ఎదుగుతోంది. విజయనగరం జిల్లాలోని గరివిడి మండలం శేరిపేట గ్రామంలో ఐదేళ్ల కిందట స్థాపించిన సంస్థ ఉడెన్ ప్యాలెట్స్ విభాగంలో అగ్రగామిగా నిలుస్తూ, నిబంధనలకు అనుగుణంగా నాణ్యమైన ఉత్పత్తులు తయారుచేస్తూ 'ఇండియా బెస్ట్ ఎంఎస్‌ఎంఈ 5000' అవార్డు దక్కించుకుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఇంటీరియర్ ఉడెన్ ఉత్పత్తులు వినియోగదారులకు అందిస్తున్నారు. ఈ ప్రక్రియలో శేరిపేట గ్రామ యువకులు కూడా వృత్తిలో రాణించేలా భాగస్వాములను చేస్తున్నారు. అన్ని రకాల హోమ్, కమర్షియల్ ఫర్నీచర్ వినియోగదారులకు అందిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు డబ్బాడ ప్రకాశరావు తెలిపారు.



2024 సంవత్సరానికి సంబంధించి 'ఇండియా బెస్ట్ ఎంఎస్‌ఎంఈ 5000' అవార్డు చేజిక్కించుకున్న ప్రకాశరావు

రెవెన్యూ వసూళ్లపై దృష్టి సారించండి..

- కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ హరి నారాయణ

విజయనగరం: ప్రజల నుంచి వివిధ పన్నుల రూపంలో రావాల్సిన రెవెన్యూ వసూళ్లను శతశాతం వసూలు చేయాలని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ హరినారాయణ ఆదేశించారు. రెవెన్యూ వసూళ్ల లక్ష్యాలను అధిగమించిన నేపథ్యంలో విజయనగర ం కార్పొరేషన్ అధికారులను అభినందించారు. సీడీఎంఏ నుంచి బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై సమీక్షించారు. ముందుగా రెవెన్యూ వసూళ్ల లక్ష్యాలను అధిగమించడం ద్వారా గణనీయమైన వృద్ధిరేటును సాధించాలని సూచించారు. అలాగే కుక్కలకు చేపడుతున్న సంతాన నిరోధక శస్త్రచికిత్సల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నగరంలో చేపడుతున్న గుంతల మరమ్మతులపై ఆరా తీశారు. ఇప్పటికే గుర్తించిన గుంతలను యుద్ధప్రాతిపదికన పూడుస్తున్నట్లు కమిషనర్ నల్లనయ్య తెలిపారు. అలాగే అన్న క్యాంటీన్ నిర్వహణపై ప్రస్తావించగా నగరంలో ఉన్న మూడు అన్న క్యాంటీన్లను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. భోజనంపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం క్యూఆర్ కోడ్ విధానాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. రానున్న వేసవి కాలంలో నగరంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రమణమూర్తి, హరిబాబు, డీఈలు శ్రీనివాసరావు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



సీడీఎంఏ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కార్పొరేషన్ అధికారులు

కోడిపందాలు నిర్వహిస్తే చర్యలు తప్పవు

విజయనగరం క్రైమ్: సంక్రాంతి పండగ నేపథ్యంలో కోడిపందాలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని రూరల్ సీఐ బి. లక్ష్మణరావు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. విజయనగరం రూరల్, గంట్యాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో గతంలో ఇటువంటి చర్యలకు పాల్పడిన వ్యక్తులను ఇప్పటికే గుర్తించి వారిని బైండోవర్ చేశామన్నారు. అలాగే మద్యం విక్రయించినా, సరఫరా చేసిన చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలకు ఎవరైనా ఇబ్బందులు కలిగించినా, అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించినా వెంటనే 91211 09427, 91211 09442, డయల్ 112కి తెలియజేయాలని కోరారు.

'దేశాన్ని కాపాడుకుందాం'

విజయనగరం ఫూల్‌బాగ్: మతోన్మాద శక్తుల నుంచి లౌకిక భారతదేశాన్ని కాపాడుకుందామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు పిలుపునిచ్చారు. సీపీఎం ప్రచారయాత్రలో భాగంగా ఫూల్‌బాగ్, దాబాతోట, గాజులరేగ, తదితర చోట్ల బుధవారం మతసామరస్య ప్రచారోద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ సమైక్యత, మతసామరస్యం, రాజ్యాంగ పరిరక్షణకై దేశ వ్యాప్తంగా సీపీఎం వారం రోజుల పాటు ప్రచార కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ సభ్యులు వి.చంద్రరావు, శాఖా కార్యదర్శి రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న శంకరరావు

కూరగాయల పంటల పరిశీలన

నెల్లిమర్ల రూరల్: హైబ్రిడ్ కూరగాయల సాగు పథకాన్ని రైతులు వినియోగించుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి ఏవీఎస్వీ జమదగ్ని సూచించారు. మండలంలోని కొండవెలగాడలో సాగు చేస్తున్న కూరగాయల పంటలను బుధవారం పరిశీలించారు. ముఖ్యంగా గ్రామానికి చెందిన రైతు బట్టు అప్పన ట్రెల్లీ విధానం ద్వారా సాగు చేస్తున్న టమాటా పంటను పరిశీలించి.. సాగు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యానశాఖ ద్వారా అమలు చేస్తున్న హైబ్రిడ్ కూరగాయల సాగు, విత్తన పథకం, తీగజాతి కూరగాయల పెంపకానికి శాశ్వత పందిళ్ల ఏర్పాటు, తదితర పథకాలను రైతులు సద్వినియోగం చేసుకుని అధిక లాభాలు పొందాలన్నారు. రాయితీ వివరాల కోసం గ్రామ ఉద్యాన శాఖ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారి జ్యోత్స్నా రాణి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతు అప్పన్నతో మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన శాఖాధికారి జమదగ్ని

పింఛన్ల మంజూరులో ప్రభుత్వం విఫలం

నెల్లిమర్ల: అర్హులైన వృద్ధులకు ఫించన్లు మంజూరు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు ఆరోపించారు. బుధవారం స్థానిక అమరవీరుల స్మారక భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వితంతువులకు పింఛన్లు మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. అలాగే 60 ఏళ్లు నిండిన వృద్ధులకు సైతం వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తవిటినాయుడు, కాళ్ల అప్పలసూరి, తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మికి 'జ్యోతిర్మణి' బిరుదు ప్రదానం



జ్యోతిర్మణి బిరుదుతో సత్కరిస్తున్న విశ్వజ్యోతి జ్యోతిష్య విజ్ఞాన సంస్థ ప్రతినిధులు

విజయనగరం టౌన్: జ్యోతిష్యశాస్త్రంలో విశేష సేవలందించినందుకు గాను జిల్లాకు చెందిన ప్రముఖ జ్యోతిష్యశాస్త్ర నిపుణురాలు గొర్తి మహాలక్ష్మికి హైదరాబాద్‌కి చెందిన విశ్వజ్యోతి జ్యోతిష్య విజ్ఞాన సంస్థ జ్యోతిర్మణి బిరుదు ప్రదానం చేసింది. ఈ మేరకు విశాఖపట్నంలో ఇటీవల నిర్వహించిన 14వ జ్యోతిష్య సభావేదికపై మహాలక్ష్మికి బిరుదు ప్రదానం చేయడంతో పాటు సన్మానించారు. దీంతో ఆమెను పలువురు అభినందించారు.

నేరాల నియంత్రణకు సహకరించాలి

విజయనగరం క్రైమ్: నేర నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ కోరారు. బుధవారం రాత్రి స్థానిక ఉడా కాలనీలో ఉన్న అపార్ట్‌మెంట్ వాసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల కాలంలో జరుగుతున్న దొంగతనాలు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, ఓటీపీ ఫ్రాడ్‌లు, మ్యాట్రిమోనియల్ ఫ్రాడ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై ప్రసన్నకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

- సీఐ శ్రీనివాస్

విజయనగరం ఫూల్‌బాగ్: యువత పుస్తకపఠనాన్ని అలవాటు చేసుకోవాలని ఒకటో పట్టణ సీఐ ఎస్. శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక కోట జంక్షన్ వద్ద విశాలాంధ్ర బుక్‌హౌస్ జిల్లా మేనేజర్ సయ్యద్ ఇబ్రహీం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విశాలాంధ్ర సంచార గ్రంథాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సోషల్ మీడియా యువతను విజ్ఞానం వైపు కాకుండా అజ్ఞానం, అశ్లీలం వైపు నడిపిస్తోందన్నారు. పుస్తకాలు చదవడం అలవాటు చేసుకుంటే మంచి నడవడిక ఏర్పడుతుందన్నారు. సంచార గ్రంథాలయం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎన్. సన్యాసిరావు, మరుపల్లి ప్రతాప్‌కుమార్, గిరిధర్‌సింగ్, ఉద్యోగి వేణు, తదితరులు పాల్గొన్నారు.



బుక్‌హౌస్‌ను ప్రారంభిస్తున్న సీఐ శ్రీనివాస్

• నియామకం..



ప్రోగ్రెసివ్ సఫాయీ కర్మచారీస్ సంఘ విజయనగరం జిల్లా అధ్యక్షుడిగా జలగడుగుల కామేష్ మరోసారి ఎన్నికయ్యారు. ఈ మేరకు సంఘం జాతీయ అధ్యక్షుడు ఇ. వీరరాజు నియామక ఉత్తర్వులను జారీ చేశారు. విజయనగరం జిల్లా బాధ్యతలతో పాటు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల పర్యవేక్షకునిగా కూడా అదనపు బాధ్యతలు అప్పగించారు. విజయనగరంలో బుధవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కామేశ్‌కు రాష్ట్ర అధ్యక్షుడు గండ్రేటి అంజిబాబు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కామేష్‌ను పలువురు అభినందించారు.

– విజయనగరం

• రామాయణ పారాయణం..



రామతీర్థం నీలాచలం పర్వతంపై కోదండ రామాలయంలో రామాయణ పారాయణం బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో బృంద ప్రతినిధి రాజగోపాలాచార్య స్వామి, అర్చకులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

– నెల్లిమర్ల రూరల్

• పేదలకు సంక్రాంతి కానుక..



సంక్రాంతి పండగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ప్రముఖ వ్యాపారవేత్త గుడిశా శ్రీనివాసరావు ఆకాంక్షించారు. బుధవారం స్థానిక పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సంఘ కార్యాలయంలో పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాతల సహకారంతో 52 నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు వెత్సా సత్యనారాయణమూర్తి, ప్రాజెక్ట్ చైర్మన్ రావ్వా శ్రీనివాస్, కార్యదర్శి మాచర్ల చంద్రశేఖర్ గుప్తా, కోశాధికారి విజ్జపు వెంకట శ్రీనివాసరావు, కో ప్రాజెక్ట్ చైర్మన్ కందుల సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

– విజయనగరం

• పుస్తకావిష్కరణ..



ప్రముఖ రాజకీయవేత్త, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొంగలి పోతన్న రచించిన ' నేను – నా జీవితం' పుస్తకాన్ని బుధవారం స్థానిక పెన్షనర్ల అసోసియేషన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణ రాజు (సురేష్‌బాబు), ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కామేశ్వరరావు, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ.. జిల్లా గ్రంథాలయాన్ని చదువుల వనంగా తీర్చిదిద్దిన ఘనత పోతన్నకే చెల్లిందన్నారు. అనంతరం పోతన్నను సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ జక్కు రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ సూర్యనారాయణరాజు, ప్రముఖ న్యాయవాది నాలుగెస్సుల రాజు, గురజాడ విద్యాసంస్థల అధినేత ఎంవీఆర్.కృష్ణాజీ, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవీపీ.రాజు, ధవళ సర్వేశ్వరరావు, పీఏల్.సుబ్బారావు, కనక సింహాచలం, అబ్దుల్ రవూఫ్, మజ్జి కాంతారావు, దయానంద్, బంగారునాయుడు, సీనియర్ జర్నలిస్ట్ సురేష్ ఎలిశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

– విజయనగరం టౌన్

పేద నర్సింగ్ విద్యార్థినికి ఆర్థిక చేయూత

విజయనగరం: ఉన్నత చదువుల కోసం పేద విద్యార్థిని పడుతున్న తపనకు చిన్న శ్రీను సోల్జర్స్ అసోసియేషన్ అండగా నిలిచింది. ఈ మేరకు జిల్లాలోని మెరకముడిదాం మండలం ఎం.గదబవలస గ్రామానికి చెందిన తుమరాడ దీపిక విశాఖలోని సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో విద్య నభ్యసిస్తుండగా..ఫీజు అవసరాల నిమిత్తం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ మేరకు దీపిక తన తల్లితో కలిసి చిన్న శ్రీను సోల్జర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు మజ్జి సిరిసహస్రను బుధవారం విజయనగరంలో కలిసింది. విద్యార్థిని ఇబ్బందిపై స్పందించిన సిరిసహస్ర తక్షణమే ఆర్థికసాయం కింద రూ.5వేల మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టుదల, క్రమశిక్షణతో చదువుకుంటే మంచి ఫలితం వస్తుందన్నారు. మెరిట్ విద్యార్థులకు సహాయం చేసేందుకు తమ సంస్థ ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని, ప్రతిభను ప్రోత్సహించడమే తమ సంస్థ ధ్యేయమని చెప్పారు.



నర్సింగ్ విద్యార్థిని దీపికతో సిరిసహస్ర

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు

విజయనగరం క్రైమ్: విజయనగరం నుంచి నెల్లిమర్ల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు స్థానిక కాటవీధి వద్ద వృద్ధుడ్ని బలంగా ఢీకొట్టింది. దీనికి సంబంధించి టూటౌన్ పోలీసులు బుధవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. కాటవీధికి చెందిన డి.సోమేశ్వరరావు (80) వీధిలో నుంచి రోడ్డు వైపు వెళ్తుండగా. విజయనగరం నుంచి నెల్లిమర్ల వైపు వెళ్లే ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు స్పందించి అతడ్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఆయన పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టూటౌన్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

నిరుపేదల ఆశాజ్యోతి'సాయి సిద్ధార్థ'

- నామమాత్రపు రుసుములతో ఉన్నత చదువులు

విజయనగరం: గజపతినగరం మండలం బోడసింగిపేట గ్రామ పరిధిలో 5.21 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన సాయిసిద్ధార్థ విద్యా సంస్థలు నిరుపేదలకు ఆశాజ్యోతిగా మారాయి. 1999లో శీరంరెడ్డి సన్యాసినాయుడు ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో తొలుత సాయిసిద్ధార్థ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలలను స్థాపించారు. ఎన్‌హెచ్-43కు ఆనుకుని సొంత భవనాలతో ఉన్న విద్యాలయంలో నాణ్యమైన విద్య అందిస్తున్నారు. ప్రారంభ సంవత్సరంలో 122 మంది ఇంటర్, 72 మంది డిగ్రీ విద్యార్థులు ప్రారంభమైన కళాశాలలో ప్రస్తుతం 2,700 మంది విద్యార్థులున్నారు. ఈ ప్రయాణంలో 2003 సంవత్సరంలో కోళ్ల అప్పలనాయుడు బీఈడీ కళాశాలను స్థాపించి, ఎంతోమంది ఉపాధ్యాయులను సమాజానికి అందిస్తున్నారు. విద్యార్థులకు మెరుగైన వసతిగృహాలు కూడా అందుబాటులో ఉన్నాయి. డిగ్రీ విద్యార్థులకు స్పెషల్ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. తాతలు శీరం రెడ్డి సన్యాసినాయుడు, కోళ్ల అప్పలనాయుడు స్ఫూర్తితో తల్లిదండ్రులు డాక్టర్ పెద్దినాయుడు, శారద ప్రోత్సాహంతో నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ ఎస్. చంద్రశేఖర్ తెలిపారు. ప్రతి మూడు నెలలకోసారి సామాజిక కార్యక్రమాలు చేపడుతుంటామని కళాశాల చైర్మన్ పెద్దినాయుడు తెలిపారు. అలాగే దూర విద్య ద్వారా డిగ్రీ, పీజీ, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



ఎస్.చంద్రశేఖర్, కరస్పాండెంట్



డాక్టర్ ఎస్. పెద్దినాయుడు, కళాశాల చైర్మన్